GV MALL®
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 108 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 3 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- శుక్రవారం 22 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## ఢిల్లీ ప్రవేశ మార్గాలపై నిఘా ఉంచండి: సుప్రీం

**కాలుష్య నిరోధక నాలుగో దశ చర్యలు IV మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని సుప్రీం కోర్టు వెల్లడించింది.**



**దిల్లీ, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** దేశరాజధానిలో వాయుకాలుష్య తీవ్రత కొనసాగుతూనే ఉంది. దీంతో కాలుష్య నిరోధక నాలుగో దశ చర్యలు IV మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని సుప్రీం కోర్టు వెల్లడించింది. నిత్యావసరేతర వస్తువులు తీసుకొచ్చే ట్రక్కులు నగరంలోకి ప్రవేశించకుండా పోలీసు బలగాలను మోహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని కట్టడి చేయాలంటే 113 ప్రవేశ మార్గాల వద్ద నిఘా తప్పనిసరిగా ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. జీఆర్ఏపీ IV ఆంక్షలు సడలించాలా? వద్దా? అన్న విషయంపై వచ్చే వారం సమీక్షిస్తామని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ లతో కూడిన సుప్రీం ధర్మాసనం తెలిపింది.

# వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నినాదంతో..

## 'స్వర్ణాంధ్ర 2047': సీఎం చంద్రబాబు

**రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు.**



'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నినాదంతో దీన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. "వైకాపా ప్రభుత్వ అక్రమాలపై లోతుల్లోకి వెళ్లే కొద్దీ ఆశ్చర్యకర విషయాలు తెలుస్తున్నాయి. చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ఇన్ని తప్పులు చేయరు. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యమైంది. అప్పులు పరాకాష్టకు చేరాయి. తప్పుడు ప్రచారాన్నే ఆధారంగా చేసుకుని పనిచేశారు. వాస్తవాలు చెప్పినా వాటిని పక్కన పెట్టి అసత్యాలను పదేపదే చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు. ఇది చాలా దురదృష్టకరమైన రాజకీయం. బరితెగించి

**అమరావతి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని.. రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. భద్రత లేకుంటే రాష్ట్రంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రారన్నారు. శాసనసభలో 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్పై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు.

తప్పులు చేసి వాటిని ఒప్పులుగా చిత్రీకరించారు. ఇలాంటి విచిత్ర పరిస్థితిని నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల్లో ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారు. 93 శాతం స్ట్రయిక్ రేటుతో కూటమికి అధికారం కట్టబెట్టారు. 1995లో నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రజలకు చెప్తే సహకరించారు. అనివార్య పరిస్థితుల్లో అప్పట్లో రూ.2కి అందించే కిలో బియ్యం ధర పెంచాల్సి వచ్చింది. 1999లో విజన్-2020 తీసుకొచ్చాం. నాలెడ్జ్ ఎకానమీకి హైదరాబాద్ చిరునామాగా మారింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే భద్రత ఉండాలి. ప్రజలు కూడా దీన్ని అర్థం చేసుకోవాలి. వారికి చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రజలను చైతన్యం చేయాలి. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుంది. ప్రధాని మోదీ వికసిత్ భారత్ పిలుపునిచ్చారు. మనం స్వర్ణాంధ్ర-2047 నినాదంతో ముందుకెళ్లాలి. ఎమ్మెల్యేలపై గురుతర బాధ్యత ఉంది. నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. 2047 నాటికి మీ నియోజకవర్గం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో అందులో పొందుపర్చాలి. ప్రజలకు సేవ చేస్తే ఏ నియోజకవర్గమైనా గెలిపిస్తారు"అని చంద్రబాబు అన్నారు.

## వైకాపా హయాంలో రూ.331 కోట్ల ఉపాధి హామీ నిధుల మళ్లింపు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4,500 కోట్లతో 30 వేల పనులు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు.**

**అమరావతి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4,500 కోట్లతో 30 వేల పనులు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. సంక్రాంతి లోపు వీటిని పూర్తి చేస్తామన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గతంలో వైకాపా హయాంలో ఉపాధి పథకం నిధుల మళ్లింపు, జాబ్ కార్డుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. సాగు పనులను ఉపాధి హామీకి అనుసంధానంపై పరిశీలిస్తామని చెప్పారు. ఉపాధి హామీ కింద కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేయవచ్చన్నారు. శ్మశానాల ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టవచ్చని పేర్కొన్నారు. గతంలో రూ.331 కోట్ల ఉ



పాధి హామీ నిధుల మళ్లింపుపై విచారణ చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని విమర్శించారు.

## భారతీయ సంస్కృతిని పటిష్ఠం చేయాలి: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**భారతీయ సంస్కృతి, ఆచారాలను నిరంతరం పటిష్ఠం చేయాల్సి ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు.**

**హైదరాబాద్, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** భారతీయ సంస్కృతి, ఆచారాలను నిరంతరం పటిష్ఠం చేయాల్సి ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. హైదరాబాద్లోని శిల్పారామంలో లోకమంథన్ ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశ ప్రజల్లో సాంస్కృతిక, స్వాభిమాన్ భావన నెలకొల్పాల్సి ఉందని చెప్పారు.



రాష్ట్రాలను బలోపేతం చేసే దిశగా లోక్ మంథన్ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. "2018లో రాంచీలో లోక్మంథన్ కార్యక్రమంలో పాల్గొన్నా. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పటిష్ఠానికి ఈ ప్రయత్నం గొప్పది. ఇందులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నా. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతిలో భాగం. ఇది ఇంద్రధనస్సులోని సౌందర్యాన్ని సూచిస్తుంది" అని ద్రౌపదీ ముర్ము అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరిన దీపం-2 పథకం : మంత్రి నాదెండ్ల

**ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం ప్రారంభించిన దీపం-2 పథకం లబ్ధిదారుల సంఖ్య మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరుకోవడం గర్వకారణమని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.**

**విజయవాడ, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజల జీవన ప్రమాణాలను



మెరుగుపరిచే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం ప్రారంభించిన దీపం-2 పథకం లబ్ధిదారుల సంఖ్య మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరుకోవడం గర్వకారణమని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం విజయవాడ, కృష్ణలంకలోని కోత మిషన్ రోడ్డు ప్రాంతంలో జరిగిన దీపం-2 ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతుందని తెలిపారు. అత్యంత పారదర్శకంగా ఈ పథకం కొనసాగుతుందని చెప్పారు. ఈ పథకంపై కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, పౌర సరఫరాల కార్పొరేషన్ వీసీ, ఎండీ జి.వీరపాండ్యన్, జిల్లా ఇన్ఛార్జ్ కలెక్టర్ డా. నిధిమీనా, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య తదితరులతో కలిసి పథకం లబ్ధిదారులైన ఎం.కోటేశ్వరమ్మ కుటుంబసభ్యులతో ముచ్చటించారు.

## అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలి: కేటీఆర్

**అంతర్జాతీయంగా మళ్లీ అదానీ వ్యవహారం బయటపడిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**

**హైదరాబాద్, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** అంతర్జాతీయంగా మళ్లీ అదానీ వ్యవహారం బయటపడిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అమెరికా నుంచి ఆఫ్రికా వరకు ఇది వెలుగు చూసిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అదానీ



వ్యాపార సామ్రాజ్యం విస్తరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "మా పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అదానీ తెలంగాణకు రాలేదు. కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలియకుండా రేవంత్రెడ్డి ఆయనకు రెడాకార్పెట్ పరిచారా? రూ.12,400 కోట్లతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. విద్యుత్కు సంబంధించి ప్రాజెక్టులు అదానీకి అప్పగించేందుకు సీఎం ప్రయత్నించారు. స్కిల్ యూనివర్సిటీకి ఆయన రూ.100 కోట్ల విరాళం ఇచ్చారు. వ్యాపారవేత్తలు రూ.40వేల కోట్ల విరాళాలు ఉచితంగా ఇవ్వరని రాహుల్ గాంధీ అన్నారు. జాతీయ పార్టీకి ఓ జాతీయ విధానం ఉండాలి. అదానీతో చేసుకున్న ఒప్పందాలను కెన్యా రద్దు చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఎందుకు ఆ నిర్ణయం తీసుకోవడం లేదు? రాహుల్గాంధీకి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ముప్పు ముంచుకొస్తోంది.. విమర్శలకు ఇది సమయం కాదు: రాహుల్

**ఉత్తర భారతదేశంలో ఆందోళన కలిగిస్తున్న వాయుకాలుష్యం.. జాతీయ అత్యవసర పరిస్థితేనని లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు.**

**దిల్లీ, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** ఉత్తర భారతదేశంలో ఆందోళన కలిగిస్తోన్న వాయుకాలుష్యం.. జాతీయ అత్యవసర పరిస్థితేనని లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై కూలంకషంగా చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనాలని సహచర ఎంపీలకు పిలుపునిచ్చారు.



వాయు కాలుష్యం రూపంలో ముప్పు ముంచుకొస్తోందని, దానిని ఎదుర్కొనేందుకు సమష్టిగా స్పందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ మేరకు ఇండియా గేట్ వద్ద పర్యావరణవేత్త ఝూతో కలిసి మాట్లాడిన వీడియోను రాహుల్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. "వాయు కాలుష్యానికి సామాన్య ప్రజలే ఎక్కువగా ప్రభావితులవుతున్నారు. చాలా మంది చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉత్తరభారతంలో నెలకొన్న తాజా పరిస్థితుల వల్ల పర్యాటకం బాగా పడిపోయింది. విషపూరితంగా మారుతున్న వాతావరణాన్ని శుభ్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని రాహుల్ పేర్కొన్నారు. కాలుష్య మేఘాలు వందలాది కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నాయన్న రాహుల్.. వాటిని తొలగించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. దీని కోసం ప్రభుత్వంతోపాటు పలు సంస్థలు, ప్రజలు, నిపుణులు అందరూ కలిసి ముందడుగు వేయాలన్నారు. రాజకీయ విమర్శలు చేసుకునేందుకు ఇది తగిన సమయం కాదన్న ఆయన.. అందరూ కలిసి పరిష్కార మార్గాలను కనుక్కోవాలని సూచించారు. దీని కోసం పార్లమెంట్ సమావేశాలను వేదికగా మలచుకోవాలన్నారు. శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20 వరకు జరగనున్న సంగతి తెలిసిందే.

## పవన్ను ఆలింగనం చేసుకున్న బొత్స.. అసెంబ్లీ వద్ద ఆసక్తికర పరిణామం

**ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. డిప్యూటీ సీఎం పవన్ను వైకాపా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆలింగనం చేసుకున్నారు.**

**అమరావతి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. డిప్యూటీ సీఎం పవన్ను వైకాపా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆలింగనం చేసుకున్నారు. అసెంబ్లీ వెలుపల పవన్ కారెక్కేందుకు వస్తుండటం చూసి వైకాపాకు చెందిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు పక్కకు వెళ్లిపోయారు. అదే సమయంలో బొత్స సత్యనారాయణ ఎదురుగా నిలబడి పవన్కు నమస్కారం పెట్టారు. బొత్స స్పందన చూసి పవన్ ఆయనకు ఎదురెళ్లారు. దీంతో బొత్స కూడా వెళ్లి ఆలింగనం చేసుకున్నారు. పవన్ బొత్స భుజంపై తట్టి మర్యాదపూర్వకంగా కరచాలనం చేసి వెళ్లారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# గుడివాడ ప్రజలు 20ఏళ్లుగా నరకం అనుభవించారు: ఎమ్మెల్యే రాము

కృష్ణా జిల్లా గుడివాడలో తాగునీరు 'నాడు-నేడు' పేరుతో అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తాగునీటి శాంపిల్ ప్రదర్శన పెట్టారు.




**అమరావతి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** కృష్ణా జిల్లా గుడివాడలో తాగునీరు 'నాడు-నేడు' పేరుతో అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తాగునీటి శాంపిల్ ప్రదర్శన పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఏం చేశారో తాగునీరు చూస్తే తెలుస్తోంది. గుడివాడ ప్రజలు 20 ఏళ్లుగా నరకం అనుభవించారు. 20 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్నా ప్రజలకు మంచినీరు ఇవ్వలేకపోయారు. గుడివాడలో పచ్చగా ఉన్న నీళ్లు మేం వచ్చాక స్వచ్ఛంగా మారాయి. తాగునీటి సమస్య గురించి చెప్పగానే డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. ఫిల్టర్ బెడ్లు మార్చేందుకు చొరవచూపి రక్షితనీరు వచ్చేలా చూశారు. పవన్ కల్యాణ్ చొరవకు గుడివాడ ప్రజల తరపున కృతజ్ఞతలు. సీఎం చంద్రబాబు సమన్వయంతో గుడివాడ ప్రజలకు మంచి రోజులు వచ్చాయి" అని ఎమ్మెల్యే అన్నారు.ఖ

# వైకాపా హయాంలో ఏపీ ప్రతిష్ఠను దెబ్బతీశారు: సీఎం చంద్రబాబు

వైకాపా హయాంలో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్ను దెబ్బతీసేలా ప్రవర్తించారని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు.

**అమరావతి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా హయాంలో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్ను దెబ్బతీసేలా ప్రవర్తించారని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. "జగన్ చేసిన అవినీతి అంశాన్ని ప్రస్తావించడానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ అంశాన్ని జాగ్రత్తగా గమనిస్తోంది. మరింత సమాచారం తీసుకుని తగిన విధంగా స్పందిస్తాం. మరొకరు ఇలాంటి తప్పులు చేయకుండా చూస్తాం. అమెరికా కోర్టులో వేసిన ఛార్జిషీట్ కూడా మా దగ్గర ఉంది. దీనిపై అధ్యయనం చేసి ఎలాంటి చర్యలు చేపట్టాలో నిర్ణయం తీసుకుంటాం" అని చంద్రబాబు తెలిపారు.



## జగన్ లాంటి పిరికి వ్యక్తి సీఎం ఎలా అయ్యారు?: గోరంట్ల బుచ్చయ్య చౌదరి

తన అవినీతి ఖ్యాతిని జగన్ విశ్వవిఖ్యాతం చేసుకున్నారని తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. ఈ శాసన సభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రూ.60 వేల కోట్లు దోచుకొని జగన్ ఈడీ కేసుల్లో ఉన్నారన్నారు. 12 ఏళ్లుగా కేసును నడుపుకొంటూ వెళ్తున్నారని చెప్పారు. వాటిని ఎలా పొడిగించాలో తెలిసిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. అటువంటి వ్యక్తికి రూ.1,750 కోట్లు లంచం తీసుకోవడం ఓ లెక్కా అని ఎద్దేవా చేశారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలతో భారీగా దోచుకునేందుకు ప్రణాళిక చేశారని ఆరోపించారు. "జగన్ దోపిడీతో రాష్ట్రానికి నష్టం జరిగింది. అదానీతో చాలా ఒప్పందాలు చేసుకున్నారు. ఓ తెలుగు వాడు నిర్వహిస్తున్న గంగవరం పోర్టును అక్రమంగా అదానికి కట్టబెట్టారు. జగన్ అవినీతిని పరాకాష్ఠకు చేర్చారు. ప్రభుత్వ ఖర్చుతోనే తన నివాసానికి ఇనుప బారికేడ్లు పెట్టుకున్నారు. సీఎంగా పర్యటనకు వస్తే చెట్లు కొట్టేయాలా? పరదాలు పెట్టుకోవాలా? దుకాణాలు మూసేయాలా? ఇలాంటి పిరికి వ్యక్తి సీఎం ఎలా అయ్యారు? అమెరికాలో కేసులు వాయిదా వేయించుకునే



అవకాశం లేదు. దేశంలో అయితే కేసులు వాయిదా వేయించుకోవచ్చు. జగన్ చేసిన నేరాలు, అక్రమాలపై విచారణ చేయాలని కోరతున్నాం" అని బుచ్చయ్య చౌదరి అన్నారు.

## జగన్ను సభకు పిలిపించి అక్రమాలపై విచారణ చేయించాలి: ఆదినారాయణ రెడ్డి

జగన్ 15 ఏళ్ల క్రితమే రూ. లక్ష కోట్లు సంపాదించారని భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి విమర్శించారు. ఇప్పుడు ఆయన సంపాదన ఎంతుందో తెలియదన్నారు. ప్రజాధనం దోపిడీ కోసం అంగళ్లు పెట్టాడని ఎద్దేవా చేశారు. జగనన్ను సభకు పిలిపించి అక్రమాలపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.



# తప్పు చేసిన ఏ ఒక్కరినీ ప్రభుత్వం విడిచిపెట్టదు: మంత్రి లోకేశ

తెదేపా కార్యకర్తల ధైర్యాన్ని, వైకాపా నేతల పిరికితనాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి నారాలోకేశ్ అన్నారు.



**అమరావతి, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** తెదేపా కార్యకర్తల ధైర్యాన్ని, వైకాపా నేతల పిరికితనాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి నారాలోకేశ్ అన్నారు. గత ఐదేళ్లలో అక్రమ కేసులతో ఎంత వేధించినా తెదేపా శ్రేణులు ధైర్యంగా నిలబడ్డారని తెలిపారు. సోషల్మీడియాలో అసభ్య పోస్టులపై పోలీసులు ఇచ్చిన నోటీసులకే వైకాపా నేతలు రాజకీయ సన్యాసం అంటున్నారని ఎద్దేవాచేశారు. నాడు తెదేపా కార్యకర్తలు తప్పు చేయలేదు కాబట్టే అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటూ పోరాటం చేశారని వెల్లడించారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ ప్రభుత్వం విడిచిపెట్టదని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి లోకేష్ చిట్చాట్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులపై ప్రభుత్వం సీరియస్గా ఉందని పేర్కొన్నారు. వైకాపా అధినేత జగన్, ఆయన పార్టీ నాయకులు కమిటీల ఓటింగ్కు వస్తున్నారా? అని ఎమ్మెల్యేలను ఆరాతీశారు. బలం లేనప్పుడు పోటీ ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేలతో మంత్రి లోకేశ్ చర్చించారు. జాగ్రత్తగా పని చేయమని బాధ్యతలను ఇస్తూ ఎక్కువ ఓట్లతో ప్రజలు మనల్ని గెలిపించారన్నారు. ఎమ్మెల్యేల వినతులపై లోకేశ్ స్వయంగా స్టేటస్ రిపోర్ట్ ఇచ్చారు. ఎమ్మెల్యే తనకు ఇచ్చిన ప్రతీ వినతిపత్రంలో ఎన్ని పరిష్కారమయ్యాయి? కాకపోతే అందుకు గల కారణాలు వివరిస్తూ స్టేటస్ రిపోర్ట్ ఇచ్చారు. కేంద్ర మంత్రులకు వినతిపత్రం ఇస్తే వారు సమాధానం ఇస్తున్న విధానాన్ని ఇక్కడా అమలు చేస్తున్నామని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఈ విధానాన్ని మరింత పటిష్ఠం చేస్తామన్నారు. పాఠశాలల సమయం పెంపుపై భిన్నాభిప్రాయాలు వస్తున్నాయని ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తెచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా మాత్రమే ప్రస్తుతం దీన్ని అమలు చేస్తున్నామని, వస్తున్న ఫీడ్ బ్యాక్కు తగ్గట్లు నిర్ణయాలను మార్చుకుంటామని తెలిపారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం పెంచేలా స్పోర్ట్స్ యాక్టివిటీస్ పెంచుతామని మంత్రి లోకేశ్ తెలిపారు.

# నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్య సదస్సు

రోబోటిక్ శస్త్ర చికిత్సలతో మెరుగైన ఫలితాలు

:ప్రముఖ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్

వ్యాయామం, మితాహారం,మంచి అలవాట్లు గుండెపోటును దూరంగా ఉంచుతాయి: ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గురు ప్రకాష్





**నంద్యాల, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్ సహకారంతో మధుమణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు వైద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్ నిర్వహణలో జరిగిన ఈ సదస్సులో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు. సదస్సులో యశోద హాస్పిటల్ సీనియర్ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ "రోబోటిక్ శస్త్ర చికిత్స-ప్రయోజనాలు"అన్న అంశంపై ప్రసంగిస్తూ రోబోటిక్ శస్త్ర చికిత్స వలన మరింత మెరుగైన నిర్దిష్ట ఫలితాలు సాధించడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గుతుందన్నారు. శస్త్ర చికిత్స నిపుణులు రోబోటిక్ యంత్రాన్ని సమన్వయం చేస్తారన్నారు. గుండె పోటు నివారణ అన్న అంశంపై యశోద ఆసుపత్రి ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ గురు ప్రకాష్ మాట్లాడుతూ తగిన వ్యాయామం క్రమం తప్పకుండా చేయడం, సరైన మితాహారం, దురలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా గుండెపోటు రాకుండా చూసుకోవచ్చు అన్నారు. చాతిలో నొప్పి, నొప్పి మెడ, చేతులకు పాకినట్లు ఉండడం,ఒళ్లంతా చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యున్ని సంప్రదించి ఈసీజీ పరీక్ష, గుండెపోటు సంబంధించి రక్త పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు తగిన సమయంలో సత్వర చికిత్స అందిస్తే ప్రాణాపాయం తప్పించవచ్చున్నారు. గుండెపోటు నుండి కోలుకున్న తర్వాత యాంజియోగ్రామ్ పరీక్ష ద్వారా గుండె నాళాలలో ఉన్న సమస్యలు గుర్తించి దానికి సంబంధించిన చికిత్సలు చేయించుకోవడం అవసరం అన్నారు. వక్తలను ఐఎంఏ నంద్యాల జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ పనిల్ కుమార్, నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ వసుధ రాణి,యశోద ఆసుపత్రి ఫిజీషియన్ డాక్టర్ నవీన్ రెడ్డి, మేనేజర్ పరమేష్ , ఎగ్జిక్యూటివ్ ప్రతినిధి అక్బర్,అధిక సంఖ్యలో నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.

# శారీరక దృఢత్వం మానసిక వికాసం కొరకు వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ నిర్వహణ



**నంద్యాల క్రైం, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఎదురుగా గల మైదానం నందు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శుక్రవారం సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, వారి సిబ్బందితో వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఈ వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తప్పనిసరిగా సాయుధ బలగాల సిబ్బంది సివిల్ పోలీసులు అందరూ హాజరుకావాలని తెలియజేశారు. పెరేడ్ డ్రిల్ చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుంది. ప్రతి శుక్రవారం పోలీస్ డ్రిల్ మాత్రమే కాకుండా యోగ ఫిజికల్ ట్రైనింగ్ మొదలగునవి నిర్వహించడం జరుగుతుంది. వివిధ రకాల పోలీస్ డ్యూటీలలో ఉన్న అందరూ ఒకే చోట కలవడం ద్వారా సమస్యలు అధికారులకు తెలియజేయడం ఈ పెరేడ్ డ్రిల్ కార్యక్రమం ఒక రీఫ్రెష్ కోర్సులా సిబ్బందికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల సబ్ డివిజన్ డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డి.ఎస్.పి శ్రీనివాసులు, సాయుధ బలగాల సిబ్బంది, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



# అదానీని తక్షణమే అరెస్టు చేయాలి

## పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

అదానీ కుంభకోణాన్ని అమెరికా అధికారులు బట్టబయలు చేశారని, వెంటనే అతన్ని అరెస్టు చేయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

**హైదరాబాద్, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** అదానీ కుంభకోణాన్ని అమెరికా అధికారులు బట్టబయలు చేశారని, వెంటనే అతన్ని అరెస్టు చేయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని కోరారు. "అదానీ దాదాపు రూ.2వేల కోట్ల మేర లంచాలు పంచారు. ఆయన అవినీతిపై రాహుల్ గాంధీ ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ స్పందించలేదు. అర్హత లేకపోయినా అదానీకి రూ.వేల కోట్ల రుణాలు ఇచ్చారు. ప్రధాని మోదీ అండతో అనేక విమానాశ్రయ కాంట్రాక్టులు చేజిక్కించుకుని అవినీతి సామ్రాజ్యం స్థాపించారు. 2014 తర్వాత అదానీ సంపద ఎలా పెరిగిందో చూశాం. రూ.100 కోట్ల అవినీతి జరిగిందని చెప్పి సీఎంలను జైల్లో వేశారు. రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీపై చర్యలేవి? " అని మహేశు కమార్డ్ ప్రశ్నించారు.



# గుంటూరులో తుపాకీ మిస్ఫైర్.. ఏఆర్ కానిస్టేబుల్ మృతి

తుపాకీ మిస్ఫైర్ అయి ఏఆర్ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గుంటూరులో శుక్రవారం చోటు చేసుకుంది.

**గుంటూరు, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** తుపాకీ మిస్ఫైర్ అయి ఏఆర్ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గుంటూరులో శుక్రవారం చోటు చేసుకుంది. తుపాకీ మిస్ ఫైర్ కావడంతో ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తలలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. ఇది గమనించి వెంటనే స్పందించిన తోటి సిబ్బంది శ్రీనివాస్ ను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు.



# రాయలసీమ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ , తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ స్పష్టీకరణ

## కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం

**నంద్యాల, నవంబర్ 22, (రిపబ్లిక్ న్యూస్):** కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన నాయకుడు చంద్రబాబు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ , తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్.అన్నారు. మంత్రి వర్గంలో దీనిపై తీర్మానం చేయడం, మండలిలో బిల్లు ప్రవేశపెట్టడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని,ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష కూడా అదేనన్నారు. 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మూడు రాజధానులంటూ ప్రజల్ని మభ్యపెట్టారన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు తప్ప చేతల్లో చూపలేదన్నారు. అందుకే న్యాయవాదులతో పాటు రాయలసీమ ప్రజల్లో ఒకింత ఆగ్రహం ఉండేదన్నారు. ఎన్నికల ముందు 'ప్రజాగళం' సభలో చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని.. ఇచ్చిన హామీ మేరకు టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే కసరత్తు మొదలు పెట్టిందన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం తక్షణ చర్యలు మొదలు పెట్టాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కు లేఖ రాసినందుకు



మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మంత్రివర్గ సమావేశంలోనూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తీర్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. రాయలసీమ ప్రాంతానికి ఇక నుంచి అన్నీ మంచి రోజులే ఉంటాయని మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1830 : దళిత సిపాయి వీరనారి ఝల్కారీబాయి జననం (మ. 1857/1890).
- 1907 : గణితావధాని లక్కోజు సంజీవరాయశర్మ జననం (మ.1997).
- 1913 : భారతీయ రిజర్వ్ బ్యాంక్ 8వ గవర్నర్ ఎల్.కె.ఝా జననం (మ.1988).
- 1963 : అమెరికా సంయుక్త రాష్ట్రాల 35వ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడి మరణం (జ.1917).
- 1968 : మద్రాసు రాష్ట్రం పేరును తమిళనాడు గా మార్చే బిల్లును లోక్‌సభ ఆమోదించింది.
- 1988: బాబా ఆమ్టే కు ఐరాస మానవహక్కుల పురస్కారం లభించింది.
- 2006 : భారతీయ మహిళా రసాయన శాస్త్రవేత్త అసీమా చటర్జీ మరణం (జ.1917).
- 2016 : సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ మరణం (జ.1930).


వీరనారి ఝల్కారీబాయి


సంజీవరాయశర్మ



భారతీయ రిజర్వ్ బ్యాంక్


జాన్ ఎఫ్ కెనడి


తమిళనాడు


బాబా ఆమ్టే


అసీమా చటర్జీ


బాలమురళీకృష్ణ

రిపబ్లిక్ స్పోర్ట్స్

## అశ్విన్ ఐపీఎల్ మాక్ వేలం.. రూ.8.5 కోట్లకు ఏ జట్టు తీసుకుందంటే?

ఐపీఎల్ మెగా వేలం రానున్న నేపథ్యంలో ఎవరిని ఏ జట్టు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. కొన్ని ఫ్రాంచైజీల వద్ద పెద్ద మొత్తాలు కూడా లేకపోవడం గమనార్హం.



ఆస్ట్రేలియా భారత్ తొలి టెస్టు జరుగుతోంది. మరోవైపు రెండు రోజుల్లో ఐపీఎల్ మెగా వేలం జరగనుంది. దీనికి సౌదీ అరేబియా వేదికగా నిలవనుంది. వేలంలో రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అశ్విన్, సిరాజ్, చాహల్ వంటి భారత స్టార్లు ఉన్నారు. గత ఏడాది వరకు రాజస్థాన్ రాయల్స్కు ఆడిన అశ్విన్ను ఆ ఫ్రాంచైజీ రిటైన్ చేసుకోలేదు. ఈసారి ఏ జట్టు తీసుకుంటుందో ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో తనకు తానుగా ఓ ఫ్రాంచైజీకి అమ్ముడైనట్లు అశ్విన్ తెలిపాడు. అయితే, ఇదంతా మాక్ వేలంలో కావడం గమనార్హం. సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండే అశ్విన్ క్రికెట్ విషయాలపై స్పందిస్తూ ఉంటాడు. తన యూట్యూబ్ ఛానల్ లో డిబేట్లూ పెడుతుంటాడు. ఆసీస్ తొలి టెస్టుకు ముందు షేర్ చేసిన వీడియోలో అశ్విన్ మాక్ వేలం నిర్వహించాడు. అందులో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తనను తీసుకున్నట్లు వెల్లడించాడు. రూ.8.5 కోట్లకు సీఎస్కేకు అమ్ముడైనట్లు పేర్కొన్నాడు. అశ్విన్ 2009 నుంచి 2015 వరకు ఆ జట్టుకే ప్రాతినిధ్యం వహించాడు. సీఎస్కే స్థానంలో వచ్చిన రైజింగ్ పుణె జట్టులోనూ ఆడాడు. 2017లో గాయం కారణంగా ఆడని అతడు.. తర్వాత పంజాబ్ కింగ్స్కు వెళ్లిపోయాడు. 2018లో కెప్టెన్గానూ బాధ్యతలు నిర్వర్తించాడు. ఢిల్లీకి వెళ్లిన అశ్విన్ గత మూడు సీజన్లు రాజస్థాన్ జట్టుకు ఆడాడు. సీఎస్కే ఈసారి అశ్విన్ను తీసుకొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

### ముందుగానే ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభం?

ఐపీఎల్ 2025 సీజన్ గతంతో పోలిస్తే ముందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పలు క్రీడా ఛానళ్ల నివేదిక ప్రకారం.. మార్చి 14 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 సీజన్ పోటీలు జరగనున్నాయి. ఐపీఎల్ 2026 ఎడిషన్ మార్చి 15 నుంచి మే 31 వరకు.. ఐపీఎల్ 2027 సీజన్ మార్చి 14 నుంచి మే 30 వరకు జరుగుతాయని కథనాలు వస్తున్నాయి. అయితే, వీటిపై ఐపీఎల్ కమిటీ లేదా బీసీసీఐ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

# పెళ్లి పనులు వాళ్లే చూసుకుంటామన్నారు:

## నాగచైతన్య-శోభిత వెడ్డింగ్ పై నాగార్జున

నాగచైతన్య- శోభిత ధూళిపాళ్ల వివాహ వేడుకకు సంబంధించిన వివరాలను నాగార్జున వెల్లడించారు. పెళ్లి సింపుల్‌గా చేయాలని నాగచైతన్య కోరినట్లు చెప్పారు.

హీరో నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల వివాహం డిసెంబరు 4న అన్నపూర్ణ స్టూడియోస్ వేదికగా జరగనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వేడుక గురించి నాగార్జున ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడారు. పెళ్లి చాలా సింపుల్గా చేయాలని నాగ చైతన్య కోరినట్లు చెప్పారు. 'ఇది మా నాన్నగారి శతజయంతి సంవత్సరం. అన్నపూర్ణ స్టూడియోస్ నాగచైతన్య- శోభితల పెళ్లికి వేదిక కావడం నాకెంతో సంతోషంగా ఉంది. ఇది కేవలం ఓ స్టూడియో కాదు.. మా కుటుంబ వారసత్వంలో ఓ భాగం. మా నాన్నగారికి ఇష్టమైన ప్రదేశం. చైతన్య పెళ్లిని చాలా సింపుల్గా చేయమని కోరాడు. కుటుంబసభ్యులు, సన్నిహితులు, సినీ ప్రముఖులు మొత్తం 300 మందిని పిలవాలని అనుకుంటున్నాం. స్టూడియోలో అందమైన సెట్లో వీళ్ల పెళ్లి జరగనుంది. అలాగే పెళ్లి పనులు కూడా వాళ్లిద్దరే చేసుకుంటామన్నారు. ఆ స్టూడియోలో వసతులు అన్నీ ఉన్నాయి. ప్రతీ సంవత్సరం అక్కడ కనీసం 10 పెళ్లిళ్లు జరుగుతుంటాయి. శోభిత తల్లిదండ్రులు సంప్రదాయబద్ధంగా పెళ్లి చేయాలని కోరారు. నాకు కూడా ఆ మంత్రాలు వినడం ఎంతో ఇష్టం. అవి వింటుంటే మనసు ప్రశాంతంగా ఉంటుంది. నాగచైతన్య శోభితల పెళ్లి సంప్రదాయ-ంమైన తెలుగు పెళ్లి కానుంది. ప్రస్తుతానికి పెళ్లి పనులు జరుగుతున్నాయి. రిసెప్షన్ వివరాలు ఇప్పుడే చెప్పలేమన్నారు. "గూఢచారి" సినిమా చూసి శోభితను ఫోన్లో అభినందించాను. హైదరాబాద్ వచ్చినప్పుడు ఇంటికి వచ్చి కలవమని ఆహ్వానించాను. ఆమె సినీ ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంది. వైజాగ్ నుంచి వచ్చి సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. ఈ స్థానానికి రావడానికి ఎంతో కష్టపడింది. గొప్ప నటి. ఉన్నతమైన ఆలోచనలు కలిగిన వ్యక్తి. శోభిత-నాగచైతన్యలను చూస్తే ఎంతో ఆనందంగా ఉంది' అంటూ శోభితపై ప్రశంసలు కురిపించారు నాగార్జున. డిసెంబరు 4న రాత్రి 8.13 నిమిషాలకు నాగచైతన్య-శోభిత వివాహ బంధంతో ఒక్కటి కానున్నారు. వీరి పెళ్లి కార్డు కూడా ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.



## ఇది బిగ్ డే..: రామ్ చరణ్ కొత్త సినిమాపై బుచ్చిబాబు పోస్ట్

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కీలక అప్డేట్ను దర్శకుడు షేర్ చేశారు.

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన కీలక అప్డేట్‌ను దర్శకుడు తాజాగా షేర్ చేశారు. శుక్రవారం ఉదయం మైసూర్లోని అమ్మవారి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. చేతిలో స్క్రిప్ట్ పేపర్లతో ఆలయ ప్రాంగణం వద్ద దిగిన ఓ ఫొటోని ఎక్స్ (ట్విటర్) వేదికగా పంచుకున్నారు. ఈరోజు తమకు బిగ్ డే అని పేర్కొన్నారు. "ఇది మాకు చాలా ముఖ్యమైన రోజు. ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న తరుణం వచ్చేసింది. మైసూర్లోని చాముండేశ్వరి మాత ఆశీస్సులతో ఇది మొదలైంది. మీ ఆశీస్సులు కూడా మాకు కావాలి" అని ఆయన పేర్కొన్నారు. ఆర్‌సి16 హ్యాష్ ట్యాగ్ జత చేశారు. బుచ్చిబాబు పెట్టిన పోస్ట్తో ఈ సినిమా రెగ్యులర్ షూట్ మొదలైందని తెలుస్తోంది. మైసూర్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక సెట్లో దాదాపు మూడు రోజుల పాటు షూట్ జరగనుందని.. కీలక సన్నివేశాలను తొలి షెడ్యూల్లో పూర్తి చేయనున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ షెడ్యూల్లో రామ్ చరణ్ పాల్గొనున్నారని టాక్. ప్రముఖ దర్శకుడు సుకుమార్ శిష్యుడిగా ఇండస్ట్రీలోకి గుర్తింపు తెచ్చుకున్నారు బుచ్చిబాబు. ఆయన దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమాతో తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నారు. ఆయన తెరకెక్కిస్తోన్న రెండో చిత్రమే 'ఆర్సీ 16'. రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమా కోసం దాదాపు రెండేళ్ల నుంచి వర్క్ చేస్తున్నారు. స్పోర్ట్స్ డ్రామాగా... గ్రామీణ నేపథ్యంలో సాగే కథతో ఈ సినిమా సిద్ధం కానున్నట్లు తెలుస్తోంది. ఇందులో రామ్ చరణ్ పాత్ర పవర్ఫుల్లా ఉండనుంది. జాన్వీకపూర్ కథానాయిక. కన్నడ నటుడు శివ రాజ్కుమార్, జగపతిబాబు ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. రెహమాన్ స్వరాలు అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'పెద్ది' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. మరోవైపు, రామ్చరణ్ ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' రిలీజ్ పనుల్లో ఉన్న విషయం తెలిసిందే. శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా జనవరి 10న విడుదల కానుంది.



రిపబ్లిక్ సినిమా
CINEMA

## హీరో నాతో ఇబ్బందికరంగా మాట్లాడాడు: ఖుష్బూ



గోవాలోని పణజీలో భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) వేడుకగా జరుగుతోన్న విషయం తెలిసిందే. తొలిరోజు జరిగిన వేడుకల్లో సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ పాల్గొన్నారు. 'సినీ పరిశ్రమలో మహిళల సంరక్షణ' అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆమె భాగమయ్యారు. ఇటీవల చర్చనీయాంశంగా మారిన ఈ టాపిక్ గురించి ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలకు అన్నిచోట్లా ఇబ్బందులు ఉన్నాయని అన్నారు. విషయం ఏదైనా నిర్ణయం మన చేతిలోనే ఉంటుందన్నారు. ఇందులోభాగంగా ఒకానొక సమయంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకున్నారు. "గతంలో ఓ సినిమా సెట్లో ఒక హీరో నాతో ఇబ్బందికరంగా మాట్లాడాడు. నాకు ఏదైనా ఛాన్స్ ఉందా? అన్నాడు. వెంటనే నేను నా చెప్పుల సైజు 41. ఇక్కడే చెంప పగలకొట్టనా? లేదా సెట్లో అందరి ముందు పగలకొట్టనా? అని అడిగా? సినిమా మాధ్యమంగా ప్రేక్షకులను అలరించాలని నేను పరిశ్రమలోకి వచ్చా. సమానత్వం, గౌరవంలో ఎక్కడా రాజీ పడకూడదనేది నా సిద్ధాంతం. ఆవిధంగానే వర్క్ చేశా" అని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. ఆ హీరో ఎవరై ఉంటారా? అని మాట్లాడుకుంటున్నారు. హేమ కమిటీ రిపోర్ట్ వెలుగులోకి వచ్చిన తర్వాత చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు బహిర్గతం అయ్యాయి. వారు ఎన్నోవిధాలా వేధింపులు ఎదుర్కొంటున్నారని ఆ రిపోర్ట్ తెలిపింది. మరోవైపు, ఎంతోమంది నటీమణులు తమకు ఎదురైన చేదు అనుభవాలను మీడియా ముందుకువచ్చి ధైర్యంగా చెప్పారు. ఈక్రమంలోనే ఇండస్ట్రీలో మహిళల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారిందని పలువురు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన ఈవిషయంపై ఇఫ్ఫీలో చర్చ జరగ్గా.. ఖుష్బూ, సుహాసిని, ఇంతియాజ్ అలీ పాల్గొని కీలక విషయాలు పంచుకున్నారు. తమకు నచ్చనిది జరుగుతున్నప్పుడు దానికి నో చెప్పడం తెలియాలన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

## ఇంటి చిట్కాలు

# ఐరన్ పాన్‌పై కూడా దోశ క్రిస్పీగా రావాలంటే ఇలా చేయండి

దోశ ఎంతమందికి ఇష్టమో.. దీనిని సరిగ్గా చేయడం అంత కష్టంగా ఉంటుంది. అది నాన్‌స్టిక్ పాన్‌పై అయితే ఈజీగా చేస్తారు. కానీ, ఐరన్‌పాన్‌పై అసలు రాదు. అలా కాకుండా ఐరన్‌పాన్‌పై కూడా పర్ఫెక్ట్‌గా రావాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి.

దోశ క్రిస్పీగా, పెర్ఫెక్ట్‌గా రావాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. సాధారణంగా ఐరన్‌పాన్‌పై దోశ వేసినప్పుడు అవి లావుగా, మెత్తగా వస్తుంటాయి. కానీ, చాలా మందికి దోశ సన్నగా క్రిస్పీగా ఉండాలని కోరుకుంటారు. వీటిని తినడానికే ఎక్కువగా ఇష్టపడతారు. ఇంట్లో చేసే దోశలు పర్ఫెక్ట్‌గా రావనే చాలా మంది బయట దొరికే క్రిస్పీ దోశలు తింటారు. అయితే, ఇప్పుడు ఇంట్లోనే అందూలోనూ ఐరన్ పాన్‌పై వేసిన దోశలు కూడా క్రిస్పీగా రావాలంటే కొన్ని ట్రిక్స్ తెలిసి ఉండాలి. అలాంటి పర్ఫెక్ట్ దోశను ఐరన్ పాన్‌పై కూడా ఎలా వేయాలో తెలుసుకోండి.






### వేడి చేయడం..

ముందుగా దోశ పాన్‌ని చక్కగా క్లీన్ చేసి స్టౌ వెలిగించండి. బాగా వేడి చేయాలి. ఎక్కువగా మంట పెట్టి పొగ వచ్చే వరకూ ప్యాన్‌ని వేడి చేయాలి. ఇదంతా మంట ఎక్కువగా ఉంచి చేయాలి. తర్వాత పాన్‌పై నూనె వేయాలి. ఇప్పుడు నీరు చల్లి గుడ్డతో పాన్ తుడవండి. గ్యాస్‌ని ఆపివేసి పాన్ చల్లారనివ్వండి. 10 నిమిషాల తర్వాత గ్యాస్ ఆన్ చేసి దోశ వేయండి.


### కాల్చడం..



ఇప్పుడు దోశ దోరగా కాలేవరకూ ఉంచండి. తర్వాత కొద్దిగా నూనె వేయండి. ఇప్పుడు దోశను మెల్లిగా తీయండి. మరో దోశ ఇలానే వేయండి. నూనె వేయకుండా దోశ పిండి వేయాలి. తర్వాత నూనె వేసి కాల్చాలి. బ్రౌన్ కలర్ వచ్చేవరకూ ఉడికించి నూనె, నెయ్యి వేసి కాల్చుకుని తినండి. దీంతో దోశలు క్రిస్పీగా వస్తాయి.



### దోశ తీసేటప్పుడు..



మీరు దోశను తీసేటప్పుడు ఇబ్బందిగా ఉంటే గరిటని ఓ సారి నీటిలో ముంచి తీయండి. దీంతో దోశ తేలిగ్గా వస్తుంది. అదే విధంగా పాన్‌ని గ్రీజ్ చేసేందుకు సగం ఉల్లిపాయని నూనెలో ముంచి పాన్‌పై రాస్తే దోశలు క్రిస్పీగా వస్తాయి.





### కొన్ని టిప్స్..



దోశ అంటుకోకుండా చక్కగా రావాలంటే పెనంపై కొద్దిగా పిండిని వేసి బాగా స్ప్రెడ్ చేయాలి. అదే విధంగా బరువైన ఐరన్ పాన్‌పై వేయండి. పాన్‌కి హ్యాండిల్ ఉండేలా చూసుకోండి. అదే విధంగా పాన్‌ని ఎక్కువగా సబ్బుతో క్లీన్ చేయొద్దు. వేడి నీటితో క్లీన్ చేస్తే చాలు.